క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత టైలరింగ్ శిక్షణ

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి ఉచిత టైలరింగ్, మగ్గం, పేయింటింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ట్రస్టు సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన యువతులు నేరుగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, నివాస వసతి ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సమాచారం కోసం సెల్: 9441303182, 6281412245 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎన్నికల సాధారణ పరిశీలకుల నియామకం

కల్వకుర్తి రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గ సాధారణ వ్యయ పరిశీలకులను ఎన్నికల కమిషన్ నియమించిందని ఎన్నికల రిటర్న్ అధికారి శ్రీనునాయక్ తెలిపారు. సాధారణ పరిశీలన అధికారిణిగా శిల్పాశర్మ ఐఏఎస్, వ్యయ పరిశీలన అధికారిగా వినోద్‌కుమార్ అహిర్వార్ ఐఆర్‌ఎస్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

శివదీక్షలు ఆరంభం



కల్వకుర్తిరూరల్: పవిత్ర కార్తీక మాసంలో పలువురు భక్తులు మంగళవారం శివదీక్ష చేపట్టారు. గురుస్వామి ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో శివమాలలను ధరించారు. శివుడికి అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శివస్వాములకు ప్రతి నిత్యం 41 రోజుల పాటు అన్నదానం దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు గురుస్వామి ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే రైతులకు మేలు

వెల్దండ: సీఎం కేసీఆర్‌తోనే రైతుల సంక్షేమం సాధ్యమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రైతుబంధు, ఉచిత విద్యుత్, రైతుబీమా తదితర పథకాలు అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. భాస్కర్‌రావు, నాగులునాయక్, తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

సాక్షి, నెట్‌వర్క్: పేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం చారకొండ, సిర్సనగండ్ల, తుర్కలపల్లి, రామచంద్రాపురం, తిమ్మాయిపల్లి, కమాల్‌పూర్, మర్రిపల్లి, శాంతిగూడెం గ్రామాలో ప్రచారం చేశారు. ఊర్కొండ ఆంజనేయ స్వామిని ఎమ్మెల్యే దంపతులు దర్శించుకున్నారు.

ప్రజలకు అండగా ఉంటా

కందనూలు: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆదరిస్తే ప్రజలకు అండగా ఉంటానని బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వంగ లక్ష్మణ్ గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కొండ మణెమ్మ దంపతులు స్వార్థపరులన్నారు. ఎలిమె రాము, ముద్దంయశ్వంత్, గుమ్మకొండ భూషయ్య, లోహిత్ రెడ్డి పాల్గొన్నారు.

డీఎస్పీ అభ్యర్థి ప్రచారం

నాగర్‌కర్నూల్‌రూరల్: ధర్మసమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గన్నోజు అరవిందాచారి మంగళవారం పట్టణంలో వలస ఓటర్లను కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బాబు, రమేశ్, అంజి తదితరులు పాల్గొన్నారు. ఓటమి భయంతోనే దాడులు

అమ్రాబాద్: అచ్చంపేటలో ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అమ్రాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చెన్నకేశవులు, మల్లేష్, శ్రీనివాసులు, తిరుపతి తదితరులు ఉన్నారు.

పోటాపోటీగా ప్రచారం

లింగాల: మండలంలోని ఆయా గ్రామాలలో ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపునకు మండల స్థాయి నాయకులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాలలో తిరిగుతూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

వెల్దండ: మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన వెంకటమ్మకు సంబంధించిన పాడి ఆవు విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం వ్యవసాయ పొలంలో పాడి ఆవు మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ దాదాపుగా రూ.90వేలు ఉంటుందని బాధితురాలు పేర్కొన్నారు.



లింగోటం ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో చిన్నారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



పెంట్లవెల్లిలో బాలల దినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా బాలల దినోత్సవం

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దేశ ప్రథమ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకొని మంగళవారం బాలల దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస, వ్యాస రచన, పాటల పోటీలలో నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అచ్చంపేటలో అంగన్‌వాడీ చిన్నారులు జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కల్వకుర్తి పంజుగులలో జెడ్పీటీసీ సభ్యుడు భరత్ ప్రసాద్ హాజరయ్యారు. అదేవిధంగా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మన్ననూర్ స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలికలు)లో విద్యార్థినులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించి తోటి విద్యార్థినులకు పాఠాలు బోధించారు. ఉప్పునుంతలలో బాలుర ప్రాథమిక పాఠశాల, తాడూరులో ప్రభుత్వ పాఠశాల, తెలకపల్లిలో సిద్దార్థ మాడల్ పాఠశాల, బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు ఏర్పాటు చేశారు.



మన్ననూర్‌లో అధికారులు, ఛాత్రోపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



తాడూరు మండలంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తాడూరు/తెలకపల్లి: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని గుట్టలపల్లి, పాల్మూరు, మేడిపూర్, ఆకునెల్లికుదురు, ఎంగంపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడ్డానన్నారు. మూడోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. రైతుబంధు, బీసీబంధు, దళతబంధు పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మెడికల్ కాలేజీలు తీసుకొచ్చానన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. తెలకపల్లితో పాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తిరూరల్: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మార్చాల, జిల్లెల్ల, యంగంపల్లి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. మార్చాలలో మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేశారు. పలు పార్టీలకు చెందిన యువతీ యువకులు కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, జిల్లెల్ల రాములు తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు. వెల్దండ మండల కేంద్రంలో కసిరెడ్డికి మద్దతుగా సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ ఇంటింటి ప్రచారం చేశారు.

గ్యారంటీ పథకాలు అమలు చేస్తాం



వంగూరు/మన్ననూర్/అచ్చంపేట రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్యారంటీ పథకాలు తప్పకుండా అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని తిరుమలగిరి, తిప్పారెడ్డిపల్లి, సర్వారెడ్డిపల్లి తండా, వెలుమలపల్లి, మన్ననూరు నల్లమల అటవీ లోతట్టు ప్రాంతం అమ్రాబాద్, లింగాల మండలంలోని ఆయా చెంచు పెంటలతో పాటు మల్లాపూర్, పుల్లాయిపల్లి, రాంపూర్, అప్పాపూర్, భౌరాపూర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అచ్చంపేట పట్టణంలోని వివిధ వార్డులలో మంగళవారం అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ సతీమణి అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వంశీకృష్ణను అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు కేవీఎస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు పండిత్‌రావు, పాండురంగారెడ్డి, అల్వాల్‌రెడ్డి, వెంకటయ్య, చిర్ర రాములు, విష్ణు, రాజు పాల్గొన్నారు.

అంజన్న మాలధారణ స్వీకరణ

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరం కిందికొండ బోగమహేశ్వరం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మద్దిమడుగు పబ్బతి అంజనేయస్వామి మాలధారణ స్వీకరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చుతాం



కొల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీలు నెరవేర్చుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. బహుజన ముక్తి పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బింగి సాయన్న, బీఎస్పీ నాయకుడు బంకల వెంకటస్వామితో పాటు జటప్రోల్, నార్లాపూర్ గ్రామాలకు చెందిన పలువురు మంగళవారం ఎల్లేని సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కొల్లాపూర్‌కు నేషనల్ హైవే తీసుకొచ్చానన్నారు. ఓడిపోయినా మాట నిలబెట్టుకున్నానన్నారు. ఈసారి ఎమ్మెల్యేగా ఆదరిస్తే రైల్వేలైన్, కొల్లాపూర్‌కు వంద పరిశ్రమలు తీసుకొస్తానన్నారు. సింగోటం రామన్న, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, సాయికృష్ణగౌడ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లోకి వలసలు

సాక్షి, నెట్‌వర్క్: పెంట్లవెల్లి మండలంలోని జటప్రోల్ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు, కొల్లాపూర్, మొలచింతపల్లి, రాజాపూర్, గుండ్యావాల్యానాయక్ తండాలలో పలువురు, కోడేరు మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల కార్యకర్తలు మంగళవారం కొల్లాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు సమక్షంలో చేరారు. మాజీ ఎంపీపీ గోవింద్‌గౌడ్, వైస్ ఎంపీపీ భీంరెడ్డి, కొత్త రాంమోహన్‌రావు ఉన్నారు.

కందనూలు: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జెడ్పీటీసీ కొండ మణెమ్మ దంపతులు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి



నాగర్‌కర్నూల్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గగ్గలపల్లిలో ఆయన గడపగడపకు కాంగ్రెస్ నినాదంతో ప్రచారం చేశారు. గ్యారంటీ పథకాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. తెలకపల్లి మండల కేంద్రంతో పాటు బిజినేపల్లి మండలంలోని గౌరారంలో కూచుకుళ్లకు మద్దతుగా ప్రచారం చేశారు. బిజినేపల్లి మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఆనంద్ చారి, మల్లేష్, మెక్కం లింగం, నాగరాజు, తదితరులు రాజేష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని చెదురుపల్లి గ్రామానికి చెందిన ధర్మయ్యకు ప్రమాదవశాత్తు కాళ్లు విరిగింది. మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.6వేల ఆర్థికసాయం అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రామచంద్రయ్య, అంజయ్య, వెంకటేష్, అంజయ్య, రామస్వామి, గోపాల్‌నాయక్,శివ, రామస్వామి తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



మన్ననూర్: సాధారణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో వాహనాల తనిఖీలు విస్తృతంగా చేపడుతున్నారు. మన్ననూర్‌లో శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలోని మృగవాణి రెస్టారెంట్ వద్ద చెక్‌పోస్టు, అటవీశాఖ వనమాళికా ప్రాంగణం, ఐటీడీఏ కార్యాలయం వద్ద ఒక్కొక్కటి చొప్పున మొత్తం మూడు చోట్ల సాయుధ పోలీస్ బలగాల ఆధ్వర్యంలో అధికారులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తూ వీడియో చిత్రీకరిస్తున్నారు. సాయుధ పోలీస్ బలగాలు, అమ్రాబాద్ పోలీసులు, వ్యవసాయ శాఖ, ఎక్సైజ్ శాఖ, అటవీ శాఖకు చెందిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లికి చెందిన కొట్టె శ్రీను మంగళవారం మద్యం తరలిస్తూ మండల కేంద్రంలో పట్టుబడినట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు. అతని వద్ద నుంచి రెండు కాటన్లు బీరు బాటిళ్లు, నాలుగు ఐబీ మద్యం ఫుల్‌బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులతో పాఠ్యపుస్తకాలు మోయించిన ఉపాధ్యాయులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద ముష్టిపల్లి, కల్వకోల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలు మోయించారు. ప్రతి ఏడాది పాఠశాలలు పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీకి సరఫరా అవుతాయి. పాఠ్యపుస్తకాలు తీసుకెళ్లేందుకు ఆయా పాఠశాలల విద్యార్థులను ఉపాధ్యాయులు తీసుకొచ్చి వారితో పాఠ్యపుస్తకాలను మోయిస్తున్నారు. ఈవిషయమై ఎంఈఓ చంద్రుడు వివరణ కోరగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బీఎస్పీలో చేరిక

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని బీఎస్పీ జిల్లా కార్యాలయంలో మంగళవారం తాడూరు మండలానికి చెందిన ఆకునెల్లికుదురు గ్రామ యువకులు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు బీఎస్పీ నియోజకవర్గ అభ్యర్థి కొత్తపల్లి కుమార్ సమక్షంలో చేరారు. తెలకపల్లి మండలంలోని బండపల్లిలో బీఎస్పీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మహేష్, ఆర్ శివశంకర్, యువకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి

వెల్దండ: మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తగుళ్ల కొండల్‌యాదవ్‌తో పాటు కొంతమంది కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకటయ్యగౌడ్, చల్లా మధుసూదన్‌రెడ్డి, వావిళ్ల కొండల్‌యాదవ్, రాములునాయక్, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పేదల సంక్షేమం



కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: బీఆర్‌ఎస్ ద్వారానే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొల్లాపూర్ పట్టణంలోని 7, 8 వార్డులకు చెందిన వడ్డెర సంఘం నాయకులు, వాల్మీకి బోయలతో పాటు స్థానికులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందరు నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడుతున్నారని, జనం మాత్రం తమ వెంటే ఉన్నారన్నారు. పార్టీలు మారే వారిని ప్రజలు కూడా గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు తథ్యమని జోస్యం చెప్పారు.

పాన్‌గల్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మేనిఫెస్టోను గడప, గడపకు వివరిస్తూ కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని నియోజకవర్గ సమన్వయ కర్త రంగినేని అభిలాష్ రావు, ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి, బండపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలంటే మరోసారి హర్షవర్ధన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్యనాయుడు, జ్యోతినందన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రఘుపతినాయుడు, శ్రీనివాసునాయుడు పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని జనుంపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు జోగు నాగేశు, రాములు, ఉస్సేన్, కిష్టయ్య, వీరస్వామితో పాటు మరి కొంత మంది ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, మిద్దెల కృష్ణ, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గట్టువైపు వెళ్లొద్దు



సాక్షి నెట్‌వర్క్: కుతంత్రాల కాంగ్రెస్ గట్టు వైపు వెళ్లొద్దని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం దయాపంతులపల్లి, కాకర్లపహాడ్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వివిధ పార్టీల కార్యకర్తలు ఈసందర్భంగా బీఆర్‌ఎస్‌లో చేరారు. నవాబుపేట్ మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మెన్ లక్ష్మయ్య పాల్గొన్నారు. రాజాపూర్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ బచ్చిరెడ్డి పాల్గొన్నారు. మొదంపల్లిలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఊర్కొండ మండల కేంద్రంతోపాటు తిమ్మనపల్లి, రేవల్లి గ్రామాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన కుమారుడు స్వరుణ్‌రెడ్డి రాణిపేట్, కొత్తపల్లి, మల్లాపూర్‌లో ప్రచారం చేశారు.

పూలకోతపై అవగాహన



బిజినేపల్లి: వివిధ రకాల పూలసాగులో వాటిని కోత కోసే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సులభమైన పని విధానంపై మహిళా రైతులకు మంగళవారం పాలెం కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. గులాబీ, చామంతి, బంతి, వంటి పూలను కోసే వారు సంచులను కాకుండ నడుముకు కట్టుకునే బుట్టలు వినియోగించాలని సూచించారు. పూల కోత బుట్టలపై రైతులకు ప్రదర్శనాత్మకంగా చూయించారు. కార్యక్రమంలో పాలెం కేవీకే శాస్త్రవేత్త డా. ఆదిశంకర్, మహిళా కూలీలు ఉన్నారు

బ్యాంకు సేవలు అందక ఇబ్బందులు



చారకొండ: మండల కేంద్రంలో యూనియన్ బ్యాంకులో సర్వర్‌లో సమస్య తలెత్తడంతో మంగళవారం ఖాతాదారులు లావాదేవీలకు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి ఖాతాదారులు బ్యాంకు ఎదుట పడిగాపులు కాశారు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్‌ను వివరణ కోరగా నెట్‌వర్క్‌లో సమస్య ఉందని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



ఊర్కొండ: మండల కేంద్రంతోపాటు ఊర్కొండపేటలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను మంగళవారం మహబూబ్‌నగర్ ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ యాదయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున కేంద్రాల్లో మంచినీరు, కరెంట్, టాయిలెట్లు వసతులతోపాటు వృద్ధులు, దివ్యాంగులు వచ్చేందుకు వీలుగా ర్యాంపులు, ఫర్నిచర్ వంటివి ఏర్పాటు చేయాలని సూచించారు. మండలంలోని అన్ని కేంద్రాల్లోలనూ తక్షణమే ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ వంకటయ్య, ఏఈ నాగమణి, సెక్టోరల్ అధికారులు, పంచాయితీ కార్యదర్శిలు ఉన్నారు.

జిప్సం వినియోగంతో అధిక దిగుబడులు



లింగాల: యాసంగిలో సాగు చేసిన వేరుశనగ పంటలో అధిక దిగుబడులు సాధించుటకు జిప్సం వాడాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని అంబట్‌పల్లి శివారులో సాగు చేసిన వేరుశనగ పంటను ఏఓ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట ప్రస్తుతం పూతదశలో ఉందని ఈ సమయంలో ఎకరాకు 200 కిలోల జిప్సం వాడితే దిగుబడులు పెరగడమే గాక, గింజ నాణ్యత బాగుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శివానంద్, పీఏసీఎస్ సీఈఓ పాండు, రైతులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



చారకొండ: అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా సమావేశంలో ఆయా శాఖల వారిగా ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. వివధ అంశాలపై ప్రజాప్రతినిధులతో కలిసి చర్చించారు. పలువురు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని కోరారు. సభకు గైర్హాజరు అయిన అధికారుల నుంచి వివరణ ఇవ్వాలని సంబంధిత అధికారులను కోరారు. ఎంపీడీఓ జయసుధ, ఎంఈఓ శంకర్ నాయక్, ఎంపీఓ వెంకటేష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులు ఉన్నారు.